


# ముందడుగు

శ్రీమతి నాయపతి కమలారాంజీ

**జ**గదీష్‌కి ఒక్క రోజులోనే ఆ ఇంటి వాతావరణం, ఆ ఇంట్లోని మనుషుల మనస్తత్వాలు చక్కగా అర్థమైపోయాయి. శోభనం ఇంకా జరగలేదు. మొదట ఇక్కడే వీళ్ళింట్లోనే చేద్దామనుకున్నారు. ఇంట్లో ఏ గదికీ సరిగ్గా తలుపులు లేవు. అన్నీ పాతబడి శిధిలావస్థలో వున్న తలుపులే. గడియలు అస్సలులేవు. ఇక్కడ శోభనం అయితే ఇహ ఇంతే సంగతులు....

"పేదరికంలో పెరిగిన పిల్ల అయితే కష్టసుఖాలు తెల్సుకుని మసలుకుంటుంది. అత్తవారింట్లో అందరితోనూ కలిసిమెలిసి వుంటుందని, వంట పనిలో ఇంటిపనిలో కూడా సహాయ పడుతుందని అమ్మ అభిప్రాయం. చదువుకున్న అమ్మాయి అయితే ఎవర్నీ లక్ష్య పెట్టదని, ఎవరి మాటా వినదని, ప్రతి దానికీ నువ్వెంత అంటే నువ్వెంత అని అడ్డంగా వాదిస్తుందని, అందుకే మొగుడితో సంసారపక్షంగా కాపురం చేసుకుందికి పదో క్లాసు చదివిన పిల్ల అయితే చాలని ఏరికోరి కాణీ కట్నం ఆశించకుండా విజయని తన కోడల్ని చేసు కుంది ఆవిడ పెళ్ళి అవగానే మిగతా వాళ్ళతో పాటు జగదీష్ తల్లిదండ్రులు వరలక్ష్మి, నారాయణమూర్తిలు కూడా వెళ్ళిపోయారు. జగదీష్ ఒక్కడే అత్త వారింట్లో ఉండి పోయాడు. తలుపులు, గడియలు చూసి భయపడి పోయి దసపల్లాలో ఒక రూమ్ బుక్‌చేసి అక్కడకు వెళ్ళిపోయాడు ముందుగా. శోభనం రాత్రి ముహూర్త సమయానికి విజయని తీసుకొస్తామని అత్తగారు, మావగారు చెప్పడంతో...

జగదీష్ గదిలో అసహనంగా అటు ఇటు తిరుగుతున్నాడు. అప్పటికే చాలాసేపయింది ఆ గదిలోకొచ్చి. విజయ ఇంకా రాలేదు. ముహూర్తం వేళ దాటిపోతున్నా ఆ అమ్మాయి ఇంకా గదిలోకి అడుగుపెట్టలేదు. మల్లెలు సౌరభాల్ని వెదజల్లడమే మా పని. మీ విషయాల్లో తలదూర్చడం ఎందుకు అన్నట్లుగా మత్తయిన సువాసనల్ని గదంతా వెదజల్లుతున్నాయి. పక్కనే టేబుల్‌మీద పాలు, పళ్ళు, స్వీట్లు అన్నీ స్టేజిమీద ఎప్పటికీ మొదలవని ప్రోగ్రాం కోసం ఓపిగ్గా, ఆత్రుతగా ఎదురుచూస్తున్న ప్రేక్షకుల్లా ఉన్నాయి. అగరువత్తుల వింత పరిమళం గదంతా వ్యాపించింది. చాలాసేపటి తర్వాత విజయ ఆ గదిలోకి అడుగుపెట్టింది. ఆమె యాంత్రికంగా అలా నడిచి వస్తుంటే మరబొమ్మకి చీర కట్టించినట్టుంది. బుగ్గల్లో కెంపులు, చూపుల్లో దొంతరలు, పెదవుల మీద వణుకు, నడకలో వయ్యారం, అడుగుల్లో తత్తరపాటు, ఏవీ కనిపించలేదు విజయలో. నిరుత్సాహపడ్డాడు జగదీష్. కాని అవేవీ మనసులో పెట్టుకోకుండా ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుంటూ ఆమెని తనకి దగ్గరగా కూర్చోబెట్టుకున్నాడు.

"విజయా!" మత్తుగా పలికింది అతని కంఠం.

"ఇది తొలి రాత్రి. మధురమైన కలలు పండించుకునే రాత్రి. ఇది మనిద్దరికీ మొదటి రాత్రి. ఇద్దరం చేరువ కావాలని, ఒకరిలో ఒకరు ఐక్యమైపోవాలని... ఎన్నో కోరికలు... ఊహలు కలుగుతున్నాయి. నీకు అలాగే అనిపిస్తోందా? చెప్పు. సిగ్గుపడకు!" ఆమె ముఖానికి దగ్గరగా తన

ముఖాన్ని చేర్చి గుసగుసగా అన్నాడు జగదీష్.

"ఏమో! నాకేం అలా అనిపించడంలేదు" తన ముఖాన్ని పక్కకు తిప్పేసుకుని తకీమని జవాబిచ్చింది విజయ.

ఖంగుతిన్నాడు జగదీష్. కాని వెంటనే మామూలుగా అయిపోయి, "పోనీ, నీకు అనిపించినా, అనిపించకపోయినా ఫర్వాలేదులే. నాతో సహకరిస్తే చాలు. మనిద్దరం జీవితాంతం కలిసి బ్రతకాలని, కష్టసుఖాలు కలిసి పంచుకోవాలని, పిల్ల పాపలతో కలకాలం వర్ధిల్లాలని పెద్దవాళ్ళు మనిద్దరికి పెళ్ళి చేశారు..." ఆమెని మెల్లగా మాటల్లో పెడుతూ పైటని తొలగించబోయాడు.

విజయ వున్నట్టుండి వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

తాటిచెట్టంత ఎత్తు లేస్తుందనుకున్న కెరటం తీరం దగ్గరే విరిగి పడినట్టనిపించింది. ఎక్కడో అపశృతి! ఎక్కడో ఏదో లోపం.

జగదీష్ హడలిపోయాడు. "అరె అదేమిటి? ఎందుకేడుస్తున్నావ్? నేనిపుడేం చేశానని ఆ ఏడుపు?"

"నాకిష్టం లేదు. నా మానాన నన్ను బ్రతకనివ్వండి" అంది భోరున ఏడుస్తూ.

"ఏడవకు. నేను నిన్నేం చేయనులే. ఊరుకో!" అన్నాడు ఓదారుస్తూ. విజయ ఒక్క నిముషం అతని ముఖంలోకి చూసింది. తర్వాత అంది.

"అది కాదు, నేను మీకొక ముఖ్యమైన విషయం చెప్పాలి".

"సరే! పొద్దున్న లేచి చెబుదువుగాని, పడుకో..." అన్నాడు జగదీష్.

"లేదు. ఇప్పుడే చెప్పాలి. నా మనసులోని బరువును దించుకుంటే గాని నాకు నిద్ర పట్టదు" అంది ఏడుపుగొంతుతో.

"నాకీ పెళ్ళి ఇష్టంలేదు" అంది నెమ్మదిగా.

పక్కలో బాంబు పడ్డట్లుగా ఫీలయ్యాడు జగదీష్.

"అదేంటి? ఆ విషయం ముందే చెప్పి వుండాల్సింది. పెళ్ళి చూపులకు వచ్చినప్పుడు నేను నిన్ను అడిగాను నీకు ఇష్టమేనా అని".

"అవును. కాని ఆ రోజు నాకు మిమ్మల్ని చేసుకోవడం ఇష్టంలేదని చెప్తే నాన్న నా తోలు వలిచేస్తారు. అందుకే అలా చెప్పలేకపోయాను".

విస్మయంగా చూశాడు ఆమెవైపు.

"అసలు సంగతేంటో వివరంగా చెప్పు. అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాను" అన్నాడు సరిగ్గా కూర్చుంటూ.

## ప్రబోధం

నల్లధనం నైతిక విలువల్ని హరిస్తుంది
మతతత్వం ముందు మానవత్వం
నిలబడలేకుంది
కులతత్వంతో గుణశీలం తలబడలేకుంది
భాషా దురభిమానం ముందు భావ సమైక్యం
దెబ్బతింటుంది
ప్రాంతీయతత్వం ముందు సమైక్యతావాదం
తలఎత్తలేకుంది
ఇన్ని సంకుచిత తత్వాల ముందు
విశాల దృక్పథం విస్తుపోతే ఎలా?
ఆర్థిక కారణంగా ఆర్ద్రత లోపిస్తే
పరమార్థం బోధిస్తూ సౌహార్దం స్థాపించు
మతం కారణంగా సన్నిహితం లోపిస్తే
మానవత్వం ద్వారా సర్వజన సమ్మతం
సాధించు
కులం కారణంగా వ్యాకులం వ్యాపిస్తే
గుణాన్ని గౌరవించే సుగుణాన్ని
బోధించు
భాష కారణంగా ద్వేషం రగిలితే
అన్ని భాషలలోని అన్య భాషా పదాల్ని
చూపించు
ప్రాంతీయ దురభిమానం ప్రబలితే
గతంలోని అనుభవాలను అవగతం
చేయించు

**- కొలసాని శ్రీరాములు**

"నేను రాజుని ప్రేమించాను".

ఇలాంటిదేదో వుండే వుంటుందని ముందే ఊహించిన జగదీష్ పెద్దగా ఆశ్చర్యపోలేదు.

"రాజు ఎవరు?" అడిగాడు చాలా కూల్‌గా.

"మా ఇంటికెదురుగా సైకిల్ రిపేరు షాపు వుంది. అక్కడ రాజు పనిచేస్తున్నాడు. నేనెప్పుడు అరుగుమీదకొచ్చినా, నా వైపు అదోలా తమాషాగా చూసేవాడు. ఆ చూపుల్లో చిక్కుకుపోయింది నా మనసు. నాన్న మెడికల్ రిప్రజెంటేటివ్. ఎప్పుడూ టూర్లలో వుండేవాడు. అమ్మ అమాయకురాలు. ఆమె కళ్ళు కప్పడం చాలా సులభం. మేమిద్దరం రోజూ కల్సుకుని ఎన్నో కబుర్లు చెప్పుకునేవాళ్ళం. శారీరకంగా కూడా మేం ఒకటయిపోయాం. కాని రాజునిచ్చి పెళ్ళి చేయడానికి మా నాన్న ఒప్పుకోడనే ఆలోచన అంతా అయిపోయాక తట్టింది. అలాంటి భయాలేవీ ముందుగా నా మనసులోకి రానేలేదు. ఎవరి కంటా పడకుండా అలా దొంగతనంగా కల్సుకోవడం మా ఇద్దరికీ చాలా సరదాగా, గమ్మత్తుగా వుండేది. సడన్‌గా నాకు పెళ్ళి నిశ్చయించారు మా నాన్న. నా గుండెలో రాయి పడింది. నాన్నకి చెప్తే చంపేస్తాడేమోనని భయం. మిమ్మల్ని మోసం చేసే ఉద్దేశం నాకు లేదు. నన్ను నమ్మండి. నా పెళ్ళి కోసం నాన్న శెలవు పెట్టి ఇంట్లోనే ఉన్నారు. ఈ విషయం ఎలాగైనా చెప్పేద్దామని వెళ్ళి ధైర్యంగా చెప్పేశాను. నేను భయపడినంతా జరిగింది. నాన్నకి చాలా కోపం వచ్చేసింది. తలుపులు వేసేసి నన్ను కొట్టారు. చితకబాదారు. అలసిపోయిందాకా కొట్టి ఆ తర్వాత "ఒసేయ్! ఈ విషయం ఎక్కడైనా చెప్పావో పీక పిసికి చంపేస్తాను. జాగ్రత్త! నోర్మూసుకుని వుండు. మంచి సంబంధం. కుర్రాడు బుద్ధిమంతుడు. కుటుంబం చాలా మంచిది. జరిగినదంతా మర్చిపో. పీడకలగా భావించు. ఈ రోజుల్లో ఇలాంటివి కామన్. ఏం ఎరగనట్టు, కట్టుకున్నవాడితో హాయిగా కాపురం చెయ్. దమ్మిడీకి పనికిరాని వెధవలక్కూడా ప్రేమ కావాల్సి వచ్చింది. ప్రేమ?! ఆ సైకిల్‌షాపు వాడ్ని కట్టుకుంటే అడుక్కుతినాలి. నువ్వూ వాడూ కల్సి ఇంటింటికెళ్ళి ముష్టెత్తుకోవాలి. ఛీ! చెప్పుకోవడానికి సిగ్గులేదే నీకు? వెఱ్ఱి వేషాలేసి గుమ్మం దాటావో చంపేస్తాను" అని రంకెలేశాడు నాన్న.

"ఆ విధంగా నాన్నకి భయపడి తల వంచి తాళి కట్టించుకున్నాను" వెక్కిళ్ళ మధ్య అంతా చెప్పుకు వచ్చింది విజయ.

జగదీష్‌కి హఠాత్తుగా భూకంపం వచ్చి తాను అందులో కూరుకుపోతున్నట్లుగా అనిపించింది.

తన జీవితం సర్వనాశనం అయిపోయిందా? ఏం చేయాలి?

తను కన్న కలలన్నీ కరిగిపోయాయి.

తీపి పూత పూసిన చేదు మాత్రలా వుంది తన బ్రతుకు.

తీపి కరిగిపోయి చేదు మిగిలింది. అంతే!

మనసుని రంపంతో కోస్తున్న ఫీలింగ్ కలుగుతోంది.

అమ్మ, నాన్న ఎన్నో ఊహించుకున్నారు.

ఒక గుండెని కదిలిస్తే కథ బయటికి వచ్చింది.

అది విన్న మరో గుండె బరువెక్కి మూలిగింది.

జగదీష్ గుండెచప్పుడు లేకుండా బద్దలైంది.

'మంట' చూడ్డానికి తమాషాగా, బాగానే వుంటుంది. కాని వేడి మాత్రం అందుకు మాడి మసైపోతున్నవాళ్ళకే తెలుస్తుంది.

ప్రస్తుతం వాళ్ళిద్దరి మధ్యా మిగిలింది శూన్యం మాత్రమే.

తన సమస్యని ఎవరితో చెప్పుకోవాలి? ఈ

సమస్యని ఎలా పరిష్కరించుకోవాలి? గుండెలో దాచుకోలేక, ఎవ్వరికీ చెప్పుకోలేక నలిగిపోతున్నాడు జగదీష్. రక్తం నీరైపోతున్నట్టు, నరాలు మెలిపెడుతున్నట్లు సవ్వడి లేని చేదు అనుభూతి.

సినిమాల్లోనూ, టీ.వి. సీరియల్స్‌లోనూ తను ఇలాంటివి చూశాడు. కాని తన జీవితంలో ఇలాంటి షాక్! నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. ఇంటికి పూర్తిగా రావడం మానుకున్నాడు.

ఇంట్లో వుంటే ఇద్దరూ ఒకే గదిలో పడుకోవాలి. లేకుంటే అమ్మ నాన్నలకి అనుమానం రావచ్చు. కాని విజయ ముఖం చూడ్డం కూడా తనకిష్టం లేదు. 'ఎంగిలి' అంటే చిన్నప్పటి నుంచి తనకి ఎలర్జీ.

అందుకే ఆఫీసు పని మీద పై వూరు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి సూట్‌కేసు తీసుకుని హోటల్‌లో చిన్న రూమ్ తీసుకుని వుండడం మొదలుపెట్టాడు.

కాని అలా ఎన్నాళ్ళు... ఎన్నాళ్ళు?!

ఆలోచనలతో అతని మెదడంతా గందరగోళంగా తయారైంది. తల బ్రద్దలైపోతోంది.

నారాయణ మూర్తికి కొడుకు విషయం ఎలాగో తెలిసిపోయింది. జగదీష్ ఉన్న హోటల్‌కి వెళ్ళాడు.

"ఏమిట్రా ఇదంతా? క్యాంప్‌కి వెళ్తున్నానని చెప్పి, పెట్టె బేడా పట్టుకుని స్వంత ఇల్లు వదిలేసి ఇక్కడకొచ్చి వుండాల్సిన ఖర్మేంటి? అసలేం జరిగింది చెప్పు!" నిలదీసి అడిగాడాయన.

జగదీష్ తండ్రి దగ్గర ఏదీ దాచలేదు. అంతా పూసగుచ్చినట్లుగా చెప్పాడు.

అంతా విని నిర్ఘాంతపోయారు నారాయణమూర్తి.

"ఇప్పుడేంటి చెయ్యడం? ఏదీ దారి? దీనికి పరిష్కారం ఏమిటి?" తల పట్టుక్కూర్చున్నారు ఆయన. సమస్యకి సమాధానం దొరక్క జుట్టు పీక్కుంటున్నాడు.

విజయని ఏం చెయ్యాలో తెలియడంలేదు.

"నా భార్యకి మరొకడితో సంబంధం ఉంది నాన్నా" అన్న కొడుకుతో "పర్వాలేదురా, ఈ రోజుల్లో ఇలాంటివన్నీ కామన్. బలవంతంగానైనా ఆమెతో కాపురం చెయ్యి" అని సలహా ఇచ్చేంత మూర్ఖుడు కాడాయన.

"విజయని వాళ్ళింటికి పంపించేద్దాం" అన్నాడు ఆఖరికి.

"లేదు నాన్నా! తను వాళ్ళింటికి వెళ్ళనంటోంది. వాళ్ళింటికి వెళ్ళితే వాళ్ళ నాన్న నిజంగా తన్ని చంపేస్తాడేమోనని భయపడి పోతోంది పాపం. అది కాక ఆ రాజుని తప్ప మరెవర్నీ భర్తగా ఊహించుకోలేనంటోంది".

జగదీష్ ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి.

పరిష్కారం ఏమిటి?

కడుపున పుట్టిన పిల్లల ఇష్టాయిష్టాలు తెల్సుకోకుండా ప్రవర్తించే ముకుందరావు లాంటి తండ్రులకి కనువిప్పు కలగాలి.

ఇంటిని, పిల్లల్ని మొదట బాధ్యతారహితంగా గాలికి వదిలేసి, ఆ తర్వాత చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్టుగా వాళ్ళని దండించి అదుపులో పెట్టాలనుకునేవాళ్ళకి గుణపాఠం నేర్పాలి.

తన కూతురు శీలం కోల్పోయిందన్న నిజాన్ని, ఆమె గతాన్ని అందంగా దాచిపెట్టి, మరొకరి జీవితంతో ఆడుకునే అలాంటి తండ్రులకి తగిన శాస్తి జరగాలి.

అతనెలా ఆ విషయాన్ని దాచిపెట్టాడో తను కూడా ఒక విషయాన్ని దాచిపెట్టి అతను జరిగిన దానికి పశ్చాత్తాపపడుతూ తల దించుకునేలాగా చెయ్యాలి.

"నాన్నా! దీనికి పరిష్కారం ఆలోచించాను. కాని అది చెప్పను. చేసి చూపిస్తాను" అన్నాడు ఆవేశంగా.

తన కొడుకు మంచివాడు, మంచివాళ్ళు తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ ఎదుటివాళ్ళని బాధపెట్టేవిగా వుండవన్న సంగతి ఆయనకి తెలుసు.

"నాన్నా! నేను చెయ్యబోయే పని మన సంస్కృతికి, సంప్రదాయానికి విరుద్ధంగా వుంటుందేమో! కాని నేను వేసే ఈ కొత్తడుగు, ముందు వెనుకలు ఆలోచించకుండా ప్రేమకి, పెళ్ళికి సరైన అర్థాలు తెలియకుండా అనాలోచితంగా ముళ్ళబాటలోకి వెళ్ళే ఈ కాలం అమ్మాయిలకి, అబ్బాయిలకి, ఇదొక సరికొత్త వెలుగుబాట కావాలి!" గంభీరంగా అన్నాడు.

జగదీష్ ఇంటికి వచ్చాడు.

విజయని పిల్చి రహస్యంగా ఏదో చెప్పాడు. ఆమె సంతోషంతో సరేనంది.

గుళ్ళో పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ జరిగిపోయాయి. విజయ పేర్న పాతికవేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాడు. రాజుకి, విజయకి వేణుగోపాల స్వామి గుడిలో నిరాడంబరంగా పెళ్ళి జరిపించాడు. ఆ పెళ్ళి పెద్దలు జగదీష్, అతని స్నేహితులు, జగదీష్ తండ్రి నారాయణమూర్తి.

రాజు విజయలు జగదీష్ కాళ్ళకి దండం పెట్టారు. ముకుందరావుకి తెలియకుండా ఈ పని చేసినందుకు బాధగానే ఉన్నా ఆయనకిలా కావాల్సిందేనని కసిగా అనుకున్నాడు.

నారాయణమూర్తి ఆప్యాయంగా కొడుకు భుజంమీద చేయి వేసి, "బాబూ! నీ నిర్ణయం ఎలాంటిదైనా, దానికి సమాజం ఏ విధంగా స్పందించినా, నువ్వు వేసిన ముందడుగు ఈ కాలపు అమ్మాయిలకి, అబ్బాయిలకి సరికొత్త బాట కావాలి" అన్నారు.

❋

